క్లుప్తంగా

ఎండ తీవ్రతతో అవస్థలు



నిర్మానుష్యంగా ఉన్న మునగపాక మెయిన్‌రోడ్డు

మునగపాక: ఎండతీవ్రత శనివారం ఒక్కసారిగా పెరిగిపోయింది. దీంతో ప్రజలు అవస్థలు పడ్డారు.ఉదయం 10 గంటల నుంచే భానుడు నిప్పులు కురిపించాడు. ఉదయం 11గంటలకు మునగపాక మెయిన్‌రోడ్డు నిర్మానుష్యంగా మారింది. అత్యవసర పనులపై బయటకు వచ్చినవారు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం 4 గంటలకు కూడా ఎండతీవ్రత తగ్గలేదు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి కుటుంబానికి చిక్కాల పరామర్శ



హరిబాబును పరామర్శిస్తున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట: మండలంలోని పాల్మన్‌పేట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు బొడ్డా హరిబాబు కుటుంబాన్ని పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు పరామర్శించారు. హరిబాబు తండ్రి సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. పాల్మన్‌పేటలో హరిబాబు స్వగృహానికి చిక్కాల రామారావు వెళ్లి పరామర్శించారు. రామారావుతో పాటు సర్పంచ్‌లు కోడ కోటేశ్వరరావు, చేపల నాగమణి తాతాజీ, పార్టీ నాయకులు మైలపల్లి శివాజీ, సింగిరి గోవిందు, మైలపల్లి బాబ్జి, మైలపల్లి కాసులు, సింగిరి రమణ, దూడ తాతారావు ఉన్నారు.

కల్వర్టు ఇలా ఉంటే.. ప్రయాణం ఎలా ?



నెలరోజుల కిందట నిర్మించిన కల్వర్టు

ఎస్.రాయవరం: స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే రోడ్డులో కల్వర్టు నిర్మించి నెల రోజులు గడుస్తున్నా రోడ్డును చదును చేయకపోవడంతో ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం పోలీస్ స్టేషన్‌కు, గూండుబిల్లు మీదుగా యలమంచిలి వెళ్లే వారికి, వ్యవసాయ కూలీ లు, రైతులకు ఈ రోడ్డు ఎంతో అనుకూలంగా ఉంటుంది. అయితే ఆ రోడ్డులో కల్వర్టు నిర్మించి నెలరోజులు గడుస్తున్నా దాని ఎత్తుమేరకు చదును చేయకపోవడతో వేరే మార్గంలో రాకపోకలు సాగించాల్సి వస్తోందని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి కల్వర్టు వద్ద రోడ్డును ఎత్తుచేసి, వినియోగంలోకి తీసుకురావలని కోరారు.

24న మిగుల సీట్ల భర్తీకి ప్రవేశపరీక్ష

మునగపాక: మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌లో 6,7,8,9 తరగతులకు సంబంధించి మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 24న ప్రవేశపరీక్ష జరుగుతుందని ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మోడల్ స్కూల్‌లో పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు.ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు జెరాక్స్‌ను తీసుకురావాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

స్వచ్ఛతతో సంపూర్ణ ఆరోగ్యం



పరిశుభ్రత పనుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

కె.కోటపాడు : వర్షాకాలం కావడంతో పాఠశాల ల పరిసరాల్లో పరిశుభ్రత పనులను ఉపాధ్యాయులు నిర్వహించాలని ఎంఈవోలు సత్యానారాయణ, ప్రసాద్ తెలిపారు. ఎంఈవో కార్యాలయం పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులతో కలిసి తొలగించే కార్యక్రమాన్ని నిర్వహించారు. పింఢ్రంగిలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు, ఏఎన్‌ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ధ్యాన వేంకటేశ్వరస్వామికి అలంకరణ

కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని జ్యేష్ఠ మాసం చివరి శనివారం పురస్కరించుకొని వజ్ర కవచాలంకృతులతోపాటు పలు రకాల పూలమాలలు, తులసీమాలలతో అందంగా అలంకరించారు. స్వామివారు దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిచ్చారు. విష్ణు సహస్రనామార్చన చేశారు.నక్షత్ర హారతి ఇచ్చారు.

అమ్మో.. పూడిమడక రోడ్డు



అధికలోడుతో మునగపాక మీదుగా వెళుతున్న లారీ



పూడిమడక రోడ్డులో భారీ వాహనాలు

- ఇష్టారాజ్యంగా భారీ వాహనాల రాకపోకలు
- రాత్రి సమయంలో మాత్రమే వాటికి అనుమతి
- పట్టనట్టు వ్యవహరిస్తున్న డ్రైవర్లు
- తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో భయాందోళనలు
- నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికుల వినతి

మునగపాక: జిల్లాలో రద్దీగా ఉండే రహదారుల్లో పూడిమడక రోడ్డు ఒకటి. ఈ రోడ్డులో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఇరుకుగా ఉండే ఈ రోడ్డుపై ప్రయాణం అంటేనే వాహన చోదకులు హడలిపోతున్నారు. ఈ రహదారిలో అధిక లోడుతో ఇష్టానుసారంగా భారీవాహనాలను నడుపుతుండడంతో తరచూ ఎక్కడో చోట ప్రమాదాలు జరుగుతున్నాయి. భారీ వాహనాల రాకపోకలపై నియంత్రణ విధించారు. రాత్రి సమయాల్లో మాత్రమే ఈ రోడ్డులో ప్రయాణానికి పోలీసులు అనుమతించారు. అయితే అవేవీపట్టకుండా జనసంచారం ఎక్కువగా ఉండే సమయాల్లో కూడా మితిమీరిన వేగంతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు.

మితిమీరిన వేగం

రాంబిల్లి మండలంలోని నేవల్‌బేస్‌కు సంబంధించిన భారీ లోడుతో వస్తున్న భారీ వాహనాలు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్నాయి. దీంతో ఇతర వాహనాల డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. అతి వేగంతో వచ్చే వాహనాల కారణంగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటుకున్నాయి.

హెచ్చరికలు బేఖాతరు

పూడిమడక రోడ్డులో భారీ వాహనాల రాకపోకల కారణంగా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో గతంలో రాజకీయాలకు అతీతంగా ఈ ప్రాంత వాసులు ఆందోళనలు నిర్వహించారు. భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలంటూ వినతులు అందజేశారు. రహదారిపై ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌తో పాటు పోలీసు ఉన్నతాధికారులను కోరారు. దీంతో స్పందించిన పోలీసులు రాత్రి సమయంలో మాత్రమే భారీ వాహనాలు రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకున్నారు. అయితే మూడు నెలలు తిరగకముందే పోలీసుల హెచ్చరికలను భారీ వాహనాల డ్రైవర్లు బేఖాతరు చేశారు. పగటిపూట కూడా యథేచ్ఛగా వాహనాలను ఈ రోడ్డులో నడుపుతున్నారు.

రహదారి విస్తరణతోనే సమస్య పరిష్కారం

అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న 14 కిలో మీటర్ల రోడ్డును వంద అడుగులకు విస్తరించనున్న నేపథ్యంలో సమస్యకు పరిష్కారం లభిస్తుందని పలువురు ఆశిస్తున్నారు. ప్రస్తుత రోడ్డు ఇరుకుగా ఉండడంతో భారీ వాహనాలను తప్పించే క్రమంలో ఎక్కడో చోట ప్రమాదాలు జరుగుతున్నాయి.దీనికి తోడు అచ్యుతాపురం సెజ్‌కు వెళ్లే బస్సుల అతివేగం కూడా ఈ ప్రాంత వాసులను ఆందోళనకు గురి చేస్తోంది.

భారీ వాహనాలతో ఇక్కట్లు



భారీ వాహనాల రాకపోకల కారణంగా పూడిమడక రోడ్డులో ప్రయాణమంటే భయంగా ఉంటోంది. భారీ వాహనాలను గతంలో రాత్రి సమయంలో మాత్రమే నడిపేవారు. ఇప్పుడు పగటిపూట కూడా నడుపుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు.ఎదురుగా వచ్చే భారీ వాహనాలను తప్పించేందుకు ఇబ్బందులు తప్పడం లేదు.

– మళ్ల కృష్ణ, ద్విచక్ర వాహనదారుడు,మునగపాక

రాత్రి సమయంలో మాత్రమే అనుమతి



భారీ వాహనాల రాకపోకలకు సంబంధించి డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నాం. పగటిపూట ఈ రోడ్డులో భారీ వాహనాలు నడప కూడదని హెచ్చరించాం. రాత్రి సమయంలో మాత్రమే పూడిమడక రోడ్డులో భారీ వాహనాలకు అనుమతిచ్చాం. రోడ్డు ప్రమాదాల నివారణకు భారీ వాహనాల డ్రైవర్లు కూడా సహకరించాలి.అధికలోడుతో వాహనాలు నడిపితే జరిమానా విధిస్తున్నాం.

– పి.ప్రసాదరావు,ఎస్ఐ, మునగపాక

ఘనంగా యోగా దినోత్సవం



జల్లూరు జెడ్పీ స్కూల్‌లో ఆసనాలు వేస్తున్న ఎంఈవో రామారావు, విద్యార్థులు



నాగులాపల్లి పీఏసీఎస్ ఆవరణలో ఆసనాలు వేస్తున్న అధికారులు, సిబ్బంది

మునగపాక: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. నాగులాపల్లి పీఏసీఎస్ సీఈవో మళ్ల స్వామి ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అనకాపల్లి పరిధిలోని పలు శాఖల ఉద్యోగులు యోగా సాధన చేశారు. సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ వి.జ్యోతీశ్వరరావు, డీసీసీబీ అనకాపల్లి బ్రాంచి ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. తోటాడ ఓంకార భవనలో పలువురు యోగా సాధన చేశారు.

కోటవురట్ల: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు శనివారం ఉత్సాహంగా యోగాసనాలు వేశారు.

నక్కపల్లి: ప్రపంచ యోగా దినోత్సవాన్ని నక్కపల్లి మండలంలోని పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెలరోజుల పాటు విద్యార్థులకు, ప్రభుత్వ శాఖల సిబ్బందికి యోగాపై శిక్షణ ఇచ్చిన యోగా ట్రైనర్లు డి.రాంబాబు, సాయి, ఆదిత్య రుత్విక్‌లను ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ నర్సింహమూర్తిలు ఎంపీడీవో కార్యాలయం వద్ద ఘనంగా సన్మానించారు.

ఎస్.రాయవరం: మండలంలోని పలుగ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులతో శనివారం యోగాసనాలు వేయించారు.

అచ్యుతాపురం రూరల్ : అచ్యుతాపురం మండలం మార్టూరులో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అల్లంపల్లి లక్ష్మి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పార్వతీదేవి, సాంబమూర్తుల కల్యాణం



నాగులాపల్లిలో పార్వతీ దేవి, సాంబమూర్తుల కల్యాణం తిలకిస్తున్న భక్తులు

మునగపాక:మండలంలోని నాగులాపల్లిలో శనివారం రాత్రి పార్వతీ దేవి, సాంబమూర్తుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. సాంబశివుని ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం ఏర్పాటుచేసిన అన్న సమారాధనకు భక్తులు భారీగా తరలివచ్చారు.

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో 'డాన్ టు డస్క్' కార్యక్రమం



ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

మాడుగుల రూరల్ : అంతర్జాతీయ వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా జూన్‌లో నిర్వహించే డాన్ టు డస్క్ కార్యక్రమం శనివారం ఉత్సాహంగా మండలంలో నిర్వహించారు. వాసవీ క్లబ్, వనితక్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలోమాడుగుల వాసవీ క్లబ్ అధ్యక్షుడు కొట్యాడ రమేష్ అధ్యక్షతన స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో సమావేశం నిర్వహించారు. అంతకు ముందు ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు, సిబ్బందికి పండ్లు, రొట్టెలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అంతర్జాతీయ వాసవీక్లబ్ అదనపు కోశాధికారి రామయ్య, కార్యక్రమం పరిశీలకుడు అంతర్జాతీయ వాసవీక్లబ్ ప్రోగ్రాం సమన్వయకర్త రమణమూర్తి, రీజన్ చైర్మన్ నానాజీ, జోన్ చైర్మన్ మాధవి, వనితా క్లబ్ అధ్యక్షురాలు రాధిక, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీవో మంగతాయారు

రావికమతం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎటువంటి వ్యాధులు దరిచేరవని రావికమతం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పీవో మంగతాయరు అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిసరాలు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కేంద్రాల పరిసరాల్లో ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించారు. ప్రీ స్కూల్ పిల్లలతో పెయింటింగ్ వేయించి, యోగ చేయించారు. కార్యక్రమంలో సీడీపీఓ మంగతాయరు, ఏసీడీపీఓ పుష్పదేవి తదితరులు పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న బీఎన్ రోడ్డు



మేడివాడ వద్ద బీఎన్ రోడ్డులో కూరుకుపోయిన ట్రాక్టర్

రావికమతం : మండలంలో మేడివాడ నుంచి గర్నికం వరకు ఉన్న బీఎన్ రోడ్డు చెరువును తలపిస్తోంది. మేడివాడ వద్ద భారీ గోతులో శనివారం ట్రాక్టర్ కూరుకుపోవడంతో గంటకు పైగా ట్రాఫిక్ కు అంతరాయం కలిగింది. ఈ రోడ్డుపై ప్రయాణం చేసే వాహనదారులు తరుచూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రోడ్డులు వేస్తామని చోడవరం ఎమ్మెల్యే రాజు,అనకాపల్లి ఎంపీ రమేష్ హామీ ఇచ్చారు. కానీ కూటమి అధికారం చేపట్టి సంవత్సరం పూర్తి అయ్యింది. అయినా రోడ్డు పరిస్థితి మారలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ఎమ్మెల్యే రాజు స్పందించి తక్షణమే రోడ్డు పనులు పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

అసనగిరిలో వైద్య శిబిరం ఏర్పాటు



అసనగిరిలో వైద్యసేవలు అందిస్తున్న నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న

నాతవరం: విషాహారం తిని అస్వస్థతకు గురైన అసనగిరి గ్రామస్తులంతా కోలుకున్నారని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న అన్నారు. మండలంలో గిరిజన ప్రాంతమైన సుందరకోట పంచాయతీ శివారు అసనగిరి గ్రామంలో శనివారం వైద్యాధికారి ప్రసన్న తన సిబ్బందితో వెళ్లి వైద్య శిబిరం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి 98 మంది గిరిజనులను పరీక్షించి మందులు అందజేశారు. ఇటీ వల ఈ గ్రామం నుంచి కొందరు పాడేరు మోదకొండమ్మ దర్శనానికి వెళ్లి కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విషయం విదితమే. మూడు రోజుల పాటు ఏరియా ఆస్పత్రిలో వైద్యం పొంది గిరిజనులు కోలుకుని స్వగ్రామం చేరుకున్నారు. వారికి సకాలంలో వైద్య సేవలు కల్పించిన స్థానిక ప్రజాప్రతినిధులు, గిరిజన పెద్దలు, వైద్యాధికారులు, సిబ్బందికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

వేంకటేశ్వరస్వామి ఆలయానికి నూతన సొబగులు



ఆలయానికి వేసిన రంగులు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి నూతన సొబగులు అద్దుతున్నారు. దాతలు సమకూర్చిన రూ.6 లక్షల విరాళంతో ఆలయంపై విష్ణుమూర్తి దశావతారాల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. 2012లో ఏర్పాటు చేసిన ఆలయాన్ని దఫదఫాలుగా దాతలు, భక్తుల సహకారంతో అభివృద్ధి చేస్తున్నారు. ఇటీవల అందంగా ఆలయానికి, గోపురాలకు రంగులు వేయించారు. ఆలయ పేరుతో బోర్డును ఏర్పాటు చేశారు. తాజాగా దశావతార విగ్రహాలను శిల్పులు తయారు చేసి అమర్చి తీర్చిదిద్దుతున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మజ్జి ఫణీష్, కోన నాగ వెంకట సురేష్ పనులను పర్యవేక్షిస్తున్నారు.

మూడో రోజు కొనసాగిన మత్స్యకారుల ఆందోళన



అమలాపురంలో ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

నక్కపల్లి: మండలంలోని అమలాపురంలో మత్స్యకార సొసైటీ భూములు ఏపీఐఐసీ వారు సేకరిస్తున్నందున సొసైటీ పేరున నష్టపరిహారం చెల్లించాలంటూ మత్స్యకారులు చేపట్టిన ఆందోళన మూడో రోజు కొనసాగింది. గ్రామంలో సుమారు 43 ఎకరాలను 1994లో ప్రభుత్వం కనకమహాలక్ష్మి సొసైటీకి లీజుకు ఇచ్చిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఈ భూములను సొసైటీ సభ్యులు సాగుచేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. ఈ భూములను తాజాగా ప్రభుత్వం బల్క్‌డ్రగ్ పార్క్ కోసం సేకరిస్తోంది. రోడ్ల నిర్మాణపు పనులు ప్రారంభించడంతో మత్స్యకారులు అడ్డుకున్నారు. భూములకు నష్టపరిహారాన్ని సొసైటీ పేరున చెల్లించిన తర్వాతే పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు, అధికారులు స్పందించకపోవడంతో పనులు జరిగే ప్రాంతంలో ఆందోళన చేపట్టారు. వంటావార్పు చేస్తూ నిరసన తెలియజేస్తున్నారు. ఈ నిరసన మూడోరోజు కొనసాగింది. మత్స్యకారులకు సీపీఎం నాయకులు సంఘీభావం తెలిపారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, మత్స్యకార నాయకులు పెదకాపు తాతారావు, పారాజోగులు తదితరులు మాట్లాడుతూ రాంబిల్లిలో కేంద్రం నిర్మిస్తున్న ఎన్ఏవోబీ కోసం మత్స్యకార సొసైటీ భూములు సేకరించారని నష్టపరిహారాన్ని సొసైటీ పేరున చెల్లించడంతోపాటు మత్స్యకారులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కూడా ఇచ్చారన్నారు. ఇక్కడ కూడా అదే పద్ధతి కొనసాగించాలని కోరారు. కానీ ప్రభుత్వం ఏకపక్షంగా ఈ భూములను స్వాధీనం చేసుకుని రోడ్డు పనులు చేపట్టాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ సమస్యను గతంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు.తర్వాత పట్టించుకోలేదని తెలిపారు. మత్స్యకారులకు పరిహారం చెల్లించకుండాకుండా భూములు స్వాధీనం చేసుకుంటే అంగీకరించే ప్రసక్తి లేదన్నారు. ప్రభుత్వంనుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు. తమ సమస్యపై హోంమంత్రి వంగలపూడి అనిత స్పందించాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు.ఈ ఆందోళనలో సీపీఎం మండల కన్వీనర్ ఎం.రాజేష్,మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో మందుబాబు హల్‌చల్

ఎస్.రాయవరం:ధర్మవరం అగ్రహారం పాఠశాల ఆవరణను శనివారం ఓ మందుబాబు బార్‌గా మార్చేశాడు. మద్యం సేవిస్తూ హల్‌చల్ చేయడంతో వాచ్‌మన్ శివ, వారించి బయటకు పంపే ప్రయత్నం చేశాడు. ఆ యువకుడు వాచ్‌మన్‌పై తిరగబడి, తిడుతూ కొట్టబోయాడు. గమనించిన వాచ్‌మన్ భార్య సంధ్య సెల్‌ఫోన్‌లో మందుబాబు వీరంగాన్ని వీడియోతీసి బయటకు పోవాలని హెచ్చరించింది. అయినప్పటికీ వినకపోవడంతో ఉపాధ్యాయులు సాయంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ విభీషణరావు పాఠశాలకు వెళ్లి పరిశీలించారు.పోలీసుల రాకను గమనించి ఆ యువకుడు అక్కడనుంచి జారుకున్నాడు. ఇకపై ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటే వెంటనే సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సూచించారు. పాఠశాల సమీపంలో మద్యం విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

ఎస్‌బీఐ ఉద్యోగుల రక్తదానం



రక్తదానం చేస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు

అనకాపల్లి: ఆరోగ్య వంతులైన యువతీ యువకులు ఏడాదికి మూడు సార్లు రక్తదానం చేయడం వల్ల ఆపదో ఉన్న మరో ముగ్గురు ప్రాణాలను కాపాడవచ్చని భారతీయ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనకాపల్లి యూనియన్ రీజనల్ కార్యదర్శి పైలా ప్రసాద్ తెలిపారు. స్థానిక మెయిన్‌రోడ్డు ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఆవరణలో బ్యాంక్ చైర్మన్ శ్రీనివాసులు శెట్టి ఆదేశాలు మేరకు బ్రాంచ్ 70 వసంతాలను పురస్కరించుకుని అమరావతి సర్కిల్, రాజమహేంద్రవరం మాడ్యూల్, అనకాపల్లి బ్యాంక్ యూనియన్ ఆధ్వర్యంలో మెగా ఉచిత రక్తదాన శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన 18 నుంచి 60 ఏళ్లలోపు వారు రక్తదానం చేయవచ్చన్నారు. రక్తదానం చేసిన వ్యక్తికి రెండు, మూడు రోజుల్లో కొత్త రక్తం శరీరంలో ఉత్పత్తి అవుతుందన్నారు. సృష్టిలో రక్తం దొరకదని, ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి రక్తదానం ఎంతో అవసరమన్నారు. గతంలో పురుషులు మాత్రమే రక్తదానం చేసేవారన్నారు. ఇటీవల కాలంలో మహిళలు రక్తదానం చేయడం ఎక్కువగా కనిపిస్తోందన్నారు. వ్యాధులు బారిన పడకుండా ఉండాలంటే రక్తదానం చేయాలన్నారు. సుమారు 60 మంది బ్యాంక్ ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ రక్తాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి రక్తనిధి సిబ్బంది సేకరించారు. కార్యక్రమంలో అనకాపల్లి రీజియన్ బ్యాంక్ సీఎం ఆపరేషన్ సంజయ్, హెచ్ఆర్ మేనేజర్ మధుబాబు, మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఈశ్వరి, ఎస్‌బీఐ యూనియన్ నాయకులు నరేష్, మహేష్, అసోసియేషన్ నాయకుడు రామకృష్ణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ సంగీత దినోత్సవం



ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బల్లా నాగభూషణం

అనకాపల్లి: ప్రపంచంలో దేశ సంగీత కళాకారులు ఎంతో ఖ్యాతిని గడించి, మహానుభావులుగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక చిన్నరాజుపేటలో ప్రపంచ సంగీత దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరజీవి ఘంటసాల చిత్రపటానికి శనివారం ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్యాగయ్య, అన్నమయ్య, పురందరదాసు, క్షేత్రయ్య, రామదాసు భక్తి కీర్తనలతో భగవంతునికి అంకితమయ్యారని పేర్కొన్నారు. తెలుగు వారైన బాల మురళీ కృష్ణ, ఘంటసాల, బాలసుబ్రహ్మణ్యం, సుశీల, జానకి, లీల, పి.బి.శ్రీనివాస్ వంటి వారు తెలుగు సినీ రంగంలో తమ గానం ద్వారా తెలుగు జాతి, తెలుగు భాష కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పట్నాల కృష్ణ మోహన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు నందేల అప్పారావు, ఐ.వి.రమణ మూర్తి, ఎల్.వి.ఎ.రామారావు పాల్గొన్నారు.

విరివిగా రోటరీ క్లబ్ సేవలు



విశ్వనాథ్‌ను శాలువాతో సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

అనకాపల్లి: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు రోటరీ క్లబ్ సీనియర్ అధ్యక్షుడు బీఎస్ గుప్తా తెలిపారు. స్థానిక న్యూకాలనీ రోటరీ ఫంక్షన్ హాల్లో శుక్రవారం రాత్రి క్లబ్ చార్టర్ నైట్ డే వేడుకలను పురస్కరించుకుని నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది క్లబ్ ఆధ్వర్యంలో 30 మంది మహిళలకు అత్యాధునిక పరిజ్ఞానంతో కూడిన కుట్టు మిషన్లు పంపిణీ చేశామన్నారు. ఒక్కొక్క కుట్టు మిషన్‌కు రూ.25 వేలు ఖర్చు అయిందన్నారు. గవరపాలెం హిందూ శ్మశాన వాటికకకు రూ.కోటి విలువ చేసే క్రిమేషన్ మిషన్ అందజేశామని, గాంధీనగరం మహిళా కళాశాల బీసీ వసతి గృహ విద్యార్థినులకు రూ.1.50 లక్షల విలువ చేసే పరుపులు వితరణగా అందించామన్నారు. అనంతరం విశాఖ నుంచి వచ్చిన క్లబ్ ఫాస్ట్ అధ్యక్షుడు పి.డి.జి. విశ్వనాథ్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి క్లబ్ అధ్యక్షుడు సరిపల్లి రాజేష్, కార్యదర్శి దేవత అనిల్, సీనియర్ సభ్యులు కడిమిశెట్టి సతీష్, కె.ఎల్.కుమార్, బుద్ధ రమణాజీ, బుద్ధ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.